క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.రామదాసు బుధవారం తెలిపారు. తరగతుల వారీగా ఖాళీల వివరాలను వెల్లడించారు. 5వ తరగతిలో 22, 6వ తరగతిలో 10, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 9, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఎంపీసీలో 19, బైపీసీలో 30 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ ఏడాది మార్చిలో పదోతరగతి ఉత్తీర్ణులైన బాలురు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, తల్లితండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, తల్లి బ్యాంకు బుక్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

సచివాలయ సముదాయాలను వెంటనే పూర్తిచేయాలి



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన డీఈఈ, ఎంపీడీఓ

బొబ్బిలి: మండలంలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు ఆదేశించారు. డీఈఈ కార్యాలయంలో బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ భవనాల నిర్మాణాల ప్రగతిపై అప్రమత్తం కావాలని సూచించారు. ఎంపీడీఓ పోతుల రవికుమార్, ఎంఈఓ ఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

మండలంలో 3,896 మందికి ధ్రువపత్రాల పంపిణీ



మాట్లాడుతున్న జేసీఎస్ ఇన్‌చార్జ్ శంకరరావు, పార్టీ నాయకులు

బాడంగి: జగనన్న సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, శిబిరాలు విజయవంతం అయ్యాయని మండల జేసీఎస్ ఇన్‌చార్జి మరిపి శంకరరావు అన్నారు. ఎంపీపీ ఛాంబర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సురక్ష శిబిరాలలో ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. మండలంలో మొత్తం 18 సచివాలయాల పరిధిలో 250 క్లస్టర్లలో 3,896 ధ్రువపత్రాలను అందజేసినట్లు చెప్పారు. పాఠశాలల విద్యార్థులు, అర్హత ఉన్నా సరైన ధ్రువపత్రాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేని వారి కోసం ప్రభుత్వం జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషిచేసిన అధికారులను ఆయన అభినందించారు. సమావేశంలో గండి శంకరరావు, రెడ్డి కృష్ణ, బేతనపల్లి శంకరరావు పాల్గొన్నారు.

యూసీసీ బిల్లు రద్దు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్షం నాయకులు

బొబ్బిలి: దేశవ్యాప్తంగా మతోన్మాదాన్ని రెచ్చగొట్టే యూసీసీ బిల్లును రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని దక్షిణ దేవిడీ వద్ద వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో దేశాన్ని ఏలడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ఈ యూసీసీ బిల్లును ఆమోదించుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పొట్నూరు శంకరరావు, మునకాల శ్రీనివాసరావు, ఎస్.గోపాలం, తమటాల అప్పలనాయుడు, జాఫర్, జయరాజ్, వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే సకాలంలో పూర్తిచేయాలి

బాడంగి: మండలంలో చేపట్టిన భూముల రీసర్వేని సకాలంలో పూర్తిచేయాలని తహసీల్దార్ అబు రషీద్‌జాన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో బుధవారం సమావేశమై భూముల రీసర్వేపై పలు సూచనలు చేశారు. మండలంలో 29 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 24 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం కోడూరులో గ్రౌండ్‌ట్రూథింగ్ పనులు జరుగుతున్నాయని అన్నారు. మండలానికి 45 వేల సర్వేరాళ్లు రాగా, ఇప్పటివరకు 21 గ్రామాల్లో 36వేల రాళ్లు పాతినట్టు చెప్పారు. మిగిలిన గ్రామాల్లో సర్వే త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలను పరిశీలించి తప్పులను సరిచేయాలని సూచించారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నంనాయుడు, ఎంఆర్‌ఐ సోమన్నదొర, సర్వేయర్ సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

• ఎమ్మెల్యే కంబాల జోగులు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. కొండంపేట గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి సగటున ఏడాదికి రూ.1 లక్షకు మించి ప్రభుత్వ సాయం సంక్షేమం రూపంలో అందించినట్లు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం పైగా ప్రభుత్వం నెరవేర్చిందని వెల్లడించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పచ్చ చొక్కాలువారికే పథకాలు అందించిందని, పేదలను పట్టించుకోలేదని దూషించారు. గత ప్రభుత్వం ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేక పోయిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని నమ్మి ఓట్లు వేస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించి, ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ ముద్దన సత్యారావు, సలదీ తులసీదాస్, దివిలి వెంకటరావు, డాకరపు శివ, వంజరాపు విజయ్‌కుమార్, శాసపు వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కార్యాలయ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు తలతంపరలో..

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు తెలిపారు. ఎమ్మెల్యే కంబాగ జోగులు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

• జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



మెంటాడలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మెంటాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువగా ఉండే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని, జయితి గ్రామంలోని ఆర్బీకేను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బరువు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ పిల్లలను ఎన్.ఆర్.సి కేంద్రాలకు పంపాలని సూచించారు. ప్రతీ గ్రామంలో నెలకు రెండు సార్లు నిర్వహించే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించి చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బడి ఈడు పిల్లలంతా తప్పకుండా బడిలోనే ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కేజీబీవీల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జయితి ఆర్బీకేను సందర్శించి ఎరువులు, విత్తనాల నిల్వలపై ఆరా తీశారు. కౌలురైతు గుర్తింపుకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శేషశైలజ, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

• డీఎల్‌పీఓ మోహనరావు



చర్చలు జరుపుతున్న డీఎల్‌పీఓ మోహనరావు

రామభద్రపురం: స్థానిక మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ మోహనరావు సూచించారు. ఈ నెల 1వ తేదీ నుంచి పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు పెంచాలని డిమాండు చేస్తూ సమ్మె చేయడంతో గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామంలో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎంపీడీఓ రమామణి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణతో కలిసి బుధవారం పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులతో రెండో సారి చర్చలు జరిపారు. కార్మికులతో చర్చించి రెండు రోజుల్లో నిర్ణయం చెపుతామని సీఐటీయూ నాయకులు శంకరరావు, బలస శ్రీను చెప్పారు. తక్షణమే పారిశుద్ధ్యంపై చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ వెంకటరమణ, ఈఓ సుప్రియలకు డీఎల్‌పీఓ ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

కళ్ల కలకలను నిర్లక్ష్యం చేయొద్దు



కళ్లకలకలపై అవగాహన కల్పిస్తున్న ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ ఎస్.వసంతరావు

సంతకవిటి: కళ్ల కలకలను నిర్లక్ష్యం చేయరాదని రొటేరియన్ సప్పటి వసంతరావు, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ ఎస్.వసంతరావు అన్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో కళ్లకలక వ్యాధి వ్యాపిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోటరీక్లబ్ శ్రీకాకుళం, ప్రభావతి జాగృతి ట్రస్ట్ సంయుక్తంగా మండవకురిటి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం కళ్లకలక వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంటిలో ఎరుపు చారలు, దురద, పుసికట్టడం, కంటిరెప్పలు అంటుకోవడం, నొప్పి, నీరుకారడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. కళ్ల కలకలు వచ్చినవారు కంటిలో ఎటువంటి పసర మందులు వేయరాదని సూచించారు. కళ్లను రోజుకు నాలుగు నుంచి ఆరు సార్లు మంచినీటితో శుభ్రం చేసుకోవాలని, కంటివైద్యుని సలహా మేరకు చుక్కల మందును వాడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.వి.వి.ఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషిచేయాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, వైద్య సిబ్బంది

తెర్లాం: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి, పూనువలస సర్పంచ్ రమణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని కాలంరాజుపేటలో బుధవారం ర్యాలీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షా కాలంలో మురుగునీరు నిలిచిపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులను వ్యాపింప చేసే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో కానీ, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో కానీ చూపించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూనువలస పంచాయతీ కార్యదర్శి మధు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల జాబితాల పరిశీలన



బొబ్బిలి: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ డోల రాజేశ్వరరావు

బొబ్బిలి: తప్పులు లేని ఓటర్ల జాబితాల రూపకల్పనే లక్ష్యంగా బీఎల్‌ఓలు పనిచేయాలని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 16 సచివాలయాల పరిధిలో ఉన్న బీఎల్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల అడ్రస్‌లు, డోర్ నంబర్లను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. ఎవరైనా ఇళ్లు మారినట్లయితే వారు ఉంటున్న ఇంటి కొత్త నంబరుతో అడ్రస్‌ను జాబితాలో నమోదు చేయాలన్నారు. అలాగే ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల డీటీ శ్రీనివాసరావు, సచివాలయాల సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాజాం: మండలంలో పలుగ్రామాల్లో ఓటరు సర్వే చురుగ్గా జరుగుతోంది. అంతకాపల్లి, కంచరాం, డీఆర్‌ఎన్‌వలస తదితర గ్రామాల్లో బుధవారం చేపట్టిన సర్వేను తహసీల్దార్ ఎస్‌కే రాజు పరిశీలించారు. ఓటర్ల వివరాల పరిశీలన, మార్పులు చేర్పులు, కొత్త ఓటరు దరఖాస్తుల స్వీకరణ, తదితర అంశాలపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాల్లో తప్పుల సవరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించడంతో పాటు సరైన వివరాలు లేని ఓట్లు తొలగిస్తున్నారు.

వాహనదారులూ.. జాగ్రత్త

రాజాం సిటీ: వాహన చోదకులు రోడ్డుభద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాహన చోదకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్లపై నీరు ఉండడంతో టైర్లు జారిపోయి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున పరిమిత వేగంలో ప్రయాణించాలన్నారు. మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

1183 సంఘాలకు సున్నావడ్డీ

బాడంగి: మండలంలో 1183 స్వయం శక్తి సంఘాలు సున్నావడ్డీ పథకానికి అర్హత సాధించాయని వెలుగు ఏపీఎం పి.భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. అర్హత సాధించిన సంఘాల పొదుపు ఖాతాల్లో ప్రభుత్వం రూ.59.88 లక్షలు జమ చేయనుందని చెప్పారు. సంఘాలు తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణాలపై చెల్లించిన అసలు, వడ్డీ వాయిదాలకు గాను వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది స్త్రీనిధి ద్వారా రూ.6 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.1.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం ఈ నెలాఖరుకు రూ.9 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.10 కోట్ల 28 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎంఈజీఎస్ ద్వారా స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేస్తున్నామని వివరించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని దేవుదళ స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. దేవుదళ కేజీబీవీలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బోధనలో నూతన పద్ధతులను అనుసరించాలని, సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలన్నారు. సరైన ఉదాహరణలతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి మురపాక వెంకటరమణ, రిసోర్సు పర్సన్లు బి.భువనేశ్వర్, పీవీ గణేశ్వరరావు, చంద్రరావు, కృష్ణ పాల్గొన్నారు.

కుసుమూరులో పొలంబడి



వరినారు తీతపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సునీల్‌కుమార్

తెర్లాం: రైతులు వరినారు తీసేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని కుసుమూరు ఆర్బీకే పరిధిలో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటవరినారు మడుల తయారీ, వరినారు తీత, వరి నాట్లు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. వరినారు తీసేటప్పుడు వేర్లు తెగిపోకుండా చూడాలన్నారు. పొలంలో సరిపడా నీరు ఉండేలా చూసుకుని నాట్లు వేసుకోవాలని సూచించారు. కలుపుతీత, ఎరువుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుసుమూరు వీఏఏ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా శివాలయ నిర్మాణం

రాజాం: మండలంలో గుయ్యానవలస గ్రామంలో శివాలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.40 లక్షల అంచనా వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

బొబ్బిలి: మణిపూర్ రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాకాండను అడ్డుకోవాలని, శాంతి స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని పీసీసీ మెంబర్ మువ్వల శ్రీనివాసరావు కోరారు. హింసాకాండకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రసారం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక రాజా కాలేజ్ గ్రౌండ్‌లో బుధవారం స్థానిక యువతతో కలిసి మాట్లాడారు. సభ్యసమాజం తలదించుకునే పరిస్థితిలో ఉన్న ఈ సంఘటనలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

భాషా బోధనలో అక్షరదోషాలు నివారించాలి

రాజాం: విద్యార్థుల అక్షరదోషాలను నివారించేందుకు భాషోపాధ్యాయులు కృషి చేయాలని, టీఎల్ఎంను ఉపయోగించి బోధనచేయాలని ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలో బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సమావేశానికి సంబంధించి వివరాలు సేకరించారు. సమావేశానికి హాజరైన రాజాం, సంతకవిటి హిందీ భాషోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. బోధనలో నూతన పద్ధతులు అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎంవీ విజయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణ మాస్టారు ఆశయ సాధనకు కృషి చేస్తాం..

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి



కృష్ణ మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి, కుటుంబ సభ్యులు

తెర్లాం: ఉద్దవోలు గ్రామానికి చెందిన దివంగత ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ మాస్టార్ గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కలలు కన్నారని, ఆయన కలలను, ఆశయాల సాధనకు తమవంతు కృషిచేస్తామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఈ నెల 15న మోటార్ సైకిల్‌పై తెర్లాం మండలం కాలంరాజుపేట యూపీ స్కూల్‌కు వెళ్తుండగా రాజాం మండలం కొత్తపేట వద్ద హత్యకు గురైన విషయం విదితమే. కృష్ణ మాస్టారు పెద్దకర్మ, సంతాపసభను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి పాల్గొని మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామాభివృద్ధికి మాస్టారు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి, గ్రామస్తులను అండగా ఉంటామని, మాస్టారును హత్య చేసిన వారికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కాపుకార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రమణరాజు, బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, తెర్లాం, మెరకముడిదాం ఎంపీపీలు ఎన్.ఉమాలక్ష్మి, టి.వేణుగోపాలనాయుడు, మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, మండల రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



తెర్లాం: ఫేజ్-2 స్వచ్ఛభారత్ వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

రామభద్రపురం: గ్రామాలను స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఆశయమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సచ్ఛసర్వేక్షన్ గోడ పత్రికలను విడుదల చేశారు. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. మురుగునీటి కాలువల్లో ఎప్పటికప్పుడు దోమల మందు పిచికారీ చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారిని అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అక్కారావు, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, గేదెల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్వచ్ఛభారత్ ఫేజ్–2 కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్డీ రాంబాబు బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో విడుదల చేశారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలను మండల రీసోర్స్ కోఆర్డినేటర్ యర్రా శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు



కాగితాపల్లి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

రేగిడి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. కాగితాపల్లి గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి ఓపీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా ఈ క్లినిక్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ఇంటింట ఫీవర్ సర్వే చేసి నివేదికలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ పాఠశాలల్లో బాలికలకు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. ప్రతీ వారం ప్రభుత్వ పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌లలో అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.చలమయ్య, రీనా చౌదరి సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

రాజాం సిటీ: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ బి.భాస్కరరావు అన్నారు. మండలంలో బొద్దాం పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో డెంగీ, మలేరియాతో పాటు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 24 గంటలు పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట జె.సత్తిరాజు, పీహెచ్‌సీ వైద్యులు బి.నరేంద్ర, ఎం.సిద్దేశ్వరి తదితరులున్నారు.

350 మందికి వైద్య సేవలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన శాసపు వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని రాజాం, చీపురుపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, బెల్లాన వంశీకృష్ణ ప్రారంభించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య సేవలందించారు. సుమారు 350 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 50 మందికి వివిధ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు.

వారికి జెమ్స్ ఆస్పత్రిలో మరోసారి వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్లు చేయనున్నట్లు అసిస్టెంట్ మేనేజర్ సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ ఎస్.కూర్మినాయుడు, వెలుగు రామినాయుడు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం



లక్ష్మీపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీడీఓ నాగమణి

రేగిడి: మండలంలో లక్ష్మీపురం, పారంపేట గ్రామ సచివాలయాల వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగమణి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా మండలంలో వేల సంఖ్యలో ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమౌతున్నాయన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, సర్పంచ్ కెంబూరు తేజవెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ కెంబూరు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.